సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం ; 21 ; జూన్ ; 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 833 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



యూజీ విద్యలో మార్పులు

డిగ్రీ విద్యలో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మేజర్, మైనర్ సబ్జెక్టు కాంబినేషన్‌తో డిగ్రీలు కోర్సులు ప్రవేశపెట్టింది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.4°/23.7°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కబోత కొనసాగింది. సాయంత్రం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'గురుకుల' పరీక్ష



పరీక్షను పర్యవేక్షిస్తున్న కన్వీనర్ ప్రసాద్

లేపాక్షి: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం రాత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కన్వీనర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లేపాక్షిలో 5 సీట్లకు 64 మంది విద్యార్థులు, గుడిబండలో రెండు సీట్లుకు 64 మంది, గుండుమలలో 11 సీట్లుకు 156 మంది, రొద్దంలో 18 సీట్లుకు 167 మంది, రేగాటిపల్లిలో 4 సీట్లుకు 23 మంది, పేరూరులో 9 సీట్లుకు 134 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు వివరించారు. అదేవిధంగా బాలికల గురుకుల పాఠశాలల్లో టేకులోడులో రెండు సీట్లుకు 16 మంది, బుక్కపట్నంలో 6 సీట్లుకు 18 మంది, నసనకోటలో 8 సీట్లుకు 81 మంది విద్యార్థినులు హాజరయ్యారని పేర్కొన్నారు.

'సేవామిత్ర'లకు అవార్డులు



సేవామిత్రకు అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకం కింద ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 'సేవామిత్ర'లకు ఉత్తమ సేవా అవార్డులను అందజేశారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఉత్తమ సేవలందించిన ఇద్దరు సేవామిత్రలకు మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారం అందించారు. అవార్డు అందుకున్న వారిలో కదిరి త్రివేణి ఆస్పత్రి సేవామిత్ర లావణ్య, కదిరి అమీర్ నర్సింగ్ హోం 'సేవామిత్ర' అమరేంద్ర ఉన్నారు. వీరికి కలెక్టర్ రూ.5 వేల నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బెటాలియన్ అభివృద్ధికి చర్యలు



డీఐజీకి స్వాగతం పలుకుతున్న కమాండెంట్ జగదీష్

బుక్కరాయసముద్రం: జంతలూరువద్దనున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఏపీఎస్పీ బెటాలియన్ డీఐజీ హెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన 14వ బెటాలియన్‌ను పరిశీలించారు. బెటాలియన్ కమాండెంట్ జగదీష్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. డీఐజీ మాట్లాడుతూ బెటాలియన్‌ను మంచి వాతావరణంలో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ రమణమూర్తి, ఆర్ఐ నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతారామారావు, రాజశేఖర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యభాగ్యం.. శరవేగం

నిరుపేదకు కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలు కల్పించేందుకు వైఎస్ జగన్ సర్కార్ సిద్ధమైంది. బోధనాసుపత్రులను ఉన్నతీకరించడంతో పాటు పార్లమెంట్ నియోజకవర్గానికో వైద్యకళాశాల ఏర్పాటుకు వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే పెనుకొండ మెడికల్ కళాశాల పనులూ ముమ్మరం చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతుండగా. ఆరు నెలల్లోనే పనుల పూర్తికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

భారీ యంత్రాలతో పెనుకొండ మెడికల్ కళాశాల పనులు చేస్తున్న దృశ్యం



- చకచకా పెనుకొండ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
- ఆరు నెలల్లో ఆస్పత్రి, కళాశాల పూర్తికి చర్యలు
- భారీ యంత్రాలతో ప్రస్తుతం కళాశాల భవన నిర్మాణాలు
- త్వరలోనే బోధనాస్పత్రి పనుల ప్రారంభానికి సన్నాహాలు



3వ బ్లాక్‌లో పనులు పరిశీలిస్తున్న ఇంజినీర్లు

పెనుకొండ: గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో పెనుకొండ ఒకటి. పర్యాటకంగా ఎంతో విశిష్టత కలిగిన ఈ ప్రాంతంపై గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించిన వారు, అప్పటి పాలకులు కనీస శ్రద్ధ చూపలేదు. ఫలితంగా అన్ని రంగాల్లోనూ వెనుకబాటుకు గురైంది. కానీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పెనుకొండ రూపురేఖలు మారిపోయాయి. ఎమ్మెల్యే శంకరనారాయణ ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. రూ.కోట్ల నిధులు తెచ్చి పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేశారు. అంతేకాకుండా నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పెనుకొండలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు పాటుపడ్డారు.

రూ. 475 కోట్లతో పనులు..

పెనుకొండ జాతీయ రహదారిపై ఉండటంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రవాణాకు అనుకూలంగా ఉంటుంది. అందువల్లే ప్రభుత్వం పెనుకొండకు మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు మెడికల్ కళాశాల కోసం పట్టణ సమీపంలోని పీపాం ప్రాంతంలో 48 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇక గత పాలకులకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా రూ. 475 కోట్లు మంజూరు చేసి 2021 మే 31న పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న మెగా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) వెంటనే పనులు ప్రారంభించింది.

కొండప్రాంతం కావడంతో...

మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్న ప్రదేశం పూర్తిగా కొండప్రాంతం కావడంతో పునాదులకు కూడా బ్లాస్టింగ్ చేయాల్సి వస్తోంది. దీనివల్ల ప్రతి పనీ ఆలస్యమవుతోంది. అయినప్పటికీ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నారు. అటు పనులు దక్కించుకున్న సంస్థ కూడా మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్దేశించిన గడువులోపే నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే భారీ యంత్రాలతో ప్రస్తుతం కళాశాల భవన నిర్మాణాలు చేపట్టింది.

ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు

న్యూఢిల్లీకి చెందిన 'హాయింట్స్ డిజైన్' సంస్థ పెనుకొండ మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి భవనాలకు ప్లానింగ్ రూపొందించింది. ఆ మేరకు కాంట్రాక్టు సంస్థ పనులు కొనసాగిస్తోంది. గడువులోపే నిర్మాణాలు పూర్తి చేసేందుకు కూలీలను కోల్‌కతా, కటక్, గుజరాత్, రాజస్థాన్ నుంచి రప్పిస్తోంది. ఇప్పటికే 200 మంది ఇతర రాష్ట్రాల కార్మికులు ఇక్కడికి వచ్చి పనులు చేస్తున్నారు. పూర్తిగా స్కిల్ లేబర్ అవసరం కావడంతో ఆ దిశగా 'మెగా' ఇంజినీరింగ్ సంస్థ గట్టి చర్యలు చేపట్టింది. అలాగే స్థానికులకూ పనులు కల్పిస్తోంది.

6 బ్లాకులు..3 ఫ్లోర్లు

ప్రస్తుతం 6 బ్లాకులు, 3 ఫ్లోర్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు ప్రారంభించారు. 250 మంది కూలీలు నిరవధికంగా ఇక్కడ పని చేస్తున్నారు. డిసెంబర్‌లో మెడికల్ కళాశాలను ప్రారంభోత్సవం చేయాలని ప్రభుత్వం సంకల్పించగా, గడువులోపు మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు శ్రమిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్ఐడీసీ) ఈఈ లక్ష్మీకాంతరెడ్డి, డీఈ శ్రీనివాసరెడ్డి, జేఈ శ్రీనివాసులు పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు. అలాగే నాణ్యతలో ఎలాంటి లోపం లేకుండా టాటా కన్సల్‌టెన్సీ, క్వాలిటీ కంట్రోల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

వైద్య తరగతులు.. పక్కనే వైద్య చికిత్సలు

పెనుకొండలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నుంచి ఏటా వందమంది వైద్య విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల తర్వాత వారంతా ఇక్కడే రెసిడెంట్ డాక్టర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. ఇలా ఏటా 100 మంది ఆస్పత్రిలో పనిచేయాల్సి ఉంటుంది. వీరి కోసం ఇక్కడే నివాస గృహాలు సైతం ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా నర్సింగ్ విద్యార్థులూ ఇక్కడ శిక్షణ పొందాల్సి ఉంటుంది. దీంతోపాటు రెగ్యులర్ వైద్యులు, సిబ్బంది ఉంటారు. దీంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంటుంది. ఇక రక్త నిధి కేంద్రం, ఇతర అత్యవసర చికిత్సలూ అందిస్తారు. మొత్తంగా మెడికల్ కళాశాల ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందనున్నాయి. ఈ క్రమంలో సీఎం జగన్ ఇప్పటికే ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన పరికరాలకే రూ. 12 కోట్లు విడుదల చేశారు.

ఈ ప్రాంత వాసులకు వరం



మెడికల్ కళాశాల ఏర్పాటు ఈ ప్రాంత వాసులకు వరమనే చెప్పాలి. వైద్యసేవలు అందుబాటులోకి వస్తే నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఇక్కడి వారంతా బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఆరు నెలల తర్వాత ఆ పరిస్థితి ఉండదు. ఇంతటి మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కాడిశెట్టి శ్రీనివాసులు, పెనుకొండ

ఎదురుచూస్తున్నాం



సీఎం వైఎస్ జగన్ పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అందులోభాగంగానే పార్లమెంట్ నియోజకవర్గానికో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారు. పెనుకొండ మెడికల్ కళాశాల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని మేమంతా ఎదురుచూస్తున్నాం. ఆరు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. సేవలు అందుబాటులోకి వస్తే అత్యవసరంలో ఏ ఇబ్బందీ ఉండదు.

– షేక్ బాదుల్లా, పెనుకొండ

ఆరు నెలల్లో పనుల పూర్తి



మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణ పనులు ఆరునెలల్లో పూర్తి చేస్తాం. అనంతరం స్టాఫ్ క్వార్టర్లు, ఇతర పనులు చేపడతాం. ప్రస్తుతం రెండు ముఖద్వారాలు, అంతర్గత రోడ్లు, భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భారీ యంత్రాలతో పాటు 300 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ నిరంతరం మాతో చర్చిస్తూ పనులు సవ్యంగా సాగేలా చూస్తున్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా నిర్దేశించిన గడువులోపే నిర్మాణాలన్నీ పూర్తయ్యేలా చూస్తాం.

– శ్రీనివాసులు, జేఈ, ఏపీఎంఎస్ఐడీసీ

సమన్వయంతో పనిచేయండి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్‌జైన్



సెమినార్‌కు హాజరైన ఉద్యోగులు

- సిబ్బందిని అప్రమత్తం చేయాలి
- సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి
- సేఫ్టీ సెమినార్‌లో ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్‌జైన్

గుంతకల్లు: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రైలు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (ఎస్‌సీఆర్–జీఎం) అరుణ్‌కుమార్‌జైన్ సూచించారు. ఇటీవల ఒడిశాలోని బాలేశ్వర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా మంగళవారం గుంతకల్లులోని రైల్వే క్లబ్‌లో సేఫ్టీ సెమినార్‌ను డివిజనల్ స్థాయి అధికారులు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు, ఉద్యోగులతో నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ అధికారులు తరచూ సిబ్బంది పనితీరు, రైలు మార్గాల తనిఖీలు చేయాలని సూచించారు. కిందిస్థాయి ఉద్యోగులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ అప్రమత్తంగా ఉండేలా చూసుకునే బాధ్యత మీదేనన్నారు. చేసే పనిపై అవగాహనతో పాటు సాంకేతిక నైపుణ్యతను మెరుగుపరచుకోవాలని అన్నారు. రైలుమార్గాల నిర్వహణలో భాగంగా బ్లాక్ తీసుకున్న సమయంలో రైళ్లు ఎక్కువపడితే అక్కడ నిలబడిపోవడం, ప్రయాణికులు ఇబ్బందులకు గురికావడంతోపాటు రైల్వేకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. బ్లాక్ తీసుకునే సమయంలో ముందుస్తుగా ప్రణాళిక రూపొందించుకుని పనులు చేపడితే బాగుంటుదన్నారు. సాయంత్రం డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డివిజన్ పరిధిలోని ట్రైన్ కంట్రోలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, గూడ్స్‌రైళ్ల రాకపోకల సమయంలో సిగ్నల్ విషయంలో ఏమైనా సమస్యలు వస్తే సంబంధిత కంట్రోల్ ఆఫీస్‌లోని సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారమందించి అప్రమత్తం చేయాలని జీఎం సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఎం కె.వెంకటరమణారెడ్డి, ఏడీఆర్ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీఎస్ఓ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గతం గుర్తు చేసుకో సూరీ

- అప్పట్లో చేసిన విధ్వంసం మరువొద్దు
- ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సిగ్గుచేటు
- వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీ త్రివేణి, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, వైఎస్సార్ సీపీ నాయకులు

బత్తలపల్లి: టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గం ఎలా ఉండేదో ఒకసారి గుర్తు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూర్యనారాయణకు వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. మంగళవారం ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు స్వగృహంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బత్తలపల్లిలో రెండు, మూడు రోజులుగా వరుస సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ సంఘటనలు వెనుక టీడీపీలోని రెండు వర్గాలు కారణమన్నారు. క్షతగాత్రులను పరామర్శించడానికి వెళ్లిన సూరీ.. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబుపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. వాస్తవాలేమిటో ప్రజలకు తెలుసునన్నారు. టీడీపీ హయాంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీఓ తదితర ప్రభుత్వ కార్యాలయాల మెట్లు ఎక్కలేకపోయారని, ఇప్పుడు 50 కుటుంబాలకు ఒక వలంటీరును నియమించి కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో తెలుగుతమ్ముళ్లే పింఛను డబ్బు స్వాహా చేస్తే తాము బాధితులకు అండగా నిలిచామని, ఆ కేసులకు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని గుర్తు చేశారు. అప్పట్లో సూరి వర్గీయులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటిపైన, వాహనాలపైన దాడులు చేసి ధ్వంసం చేశారని గుర్తు చేశారు. సూరీ వ్యవహారశైలి ఏమిటో, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు అంటే ఏమిటో ప్రజలకు బాగా తెలుసునన్నారు. టీడీపీ వారిపై ఆరోపణలు చేయలేక అధికార పార్టీపైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. అలాగే నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న పోలీసులపై ఆరోపణలు సిగ్గుచేటన్నారు. సమావేశంలో సర్పంచులు అక్కిం కాటమ్మ, అక్కిం దామోదర్, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట అంజనేయులు, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, విద్యార్థి విభాగం నాయకులు నరేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి వీరనారప్ప, నడిమింటి హుసేన్, మందల హరి, కడియాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నిబంధనలన్నీ పాటించాలి

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలన్నీ పక్కాగా అమలు చేయాలని, స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాలను సకాలంలో చేపట్టాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన డీఆర్ఓ కొండయ్యతో కలిసి స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు,ఈడీటీలు, ఈఎస్ఏలు, బీఎల్ఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రీ రివిజన్ కార్యక్రమాలపై బూత్ లెవల్ అధికారులకు శిక్షణ ఇవ్వడం, ప్రతి ఫారం వివరాలు క్షుణ్ణంగా తెలియజేయడం, ఓటరుగా నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులు తదితర అంశాలు పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. అంతిమంగా జాబితాను పక్కాగా తయారు చేయాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేటప్పుడు తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అన్ని విషయాలను బాగా అర్థం చేసుకొని ముందుకెళ్లాలన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరణ చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ ఓటర్లకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అర్హత లేని ఓటర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా పథకాల అమలు మరింత పటిష్టం

- ప్రతి మండలానికీ అదనపు ఎంఈఓ
- ఉమ్మడి జిల్లాలో రెండో ఎంఈఓ పోస్టుల భర్తీ
- కౌన్సెలింగ్ ద్వారా స్థానాల కేటాయింపు




డీఈఓ కార్యాలయం

రాప్తాడురూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా పథకాలను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ఈ పథకాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు, క్షేత్రస్థాయిలో సమర్థంగా పర్యవేక్షణ చేపట్టేందుకు ప్రతి మండలానికీ అదనంగా మండల విద్యాశాఖ అధికారిని నియమించింది. గతంలో మండలానికి ఒక ఎంఈఓ మాత్రమే ఉండేవారు. పరిపాలన, విద్యా విషయక బాధ్యతలను ఒకరే చూసుకోవాల్సి రావడంతో పర్యవేక్షణలో లోపాలు తలెత్తేవి. దీంతో రెండో ఎంఈఓ కేవలం విద్యా విషయక అంశం మీదే దృష్టి సారించేలా ఈ పోస్టులు ఏర్పాటు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా అత్యంత నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి అనేక విద్యా, విద్యార్థి సంక్షేమ పథకాలను ప్రారంభించి సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. పథకాల అమలు ఉధృతి, వేగానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన రెండో ఎంఈఓ పోస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యావేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాల్లోనూ రెండో ఎంఈఓ పోస్టు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ద్వారా అర్హులైన వారిని నియమించారు.

కొత్త ఎంఈఓల పర్యవేక్షణ ఇలా...

అమ్మ–ఒడి, మనబడి నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక తదితర పథకాల అమలుతో పాటు అంగ్లమాధ్యమం అమలు, బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణ, విద్యార్థుల హాజరు, పాఠశాలల నిరంతర సందర్శన రెండో ఎంఈఓలు పర్యవేక్షిస్తారు. అలాగే పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాల కోసం ప్రణాళికలు అమలు చేస్తారు.

చాలా ఉపయోగకరం



రెండో ఎంఈఓ పోస్టు వల్ల చాలా ఉపయోగకరం. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ఒక ఎంఈఓ ఉండడం వల్ల అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ చూసుకోవడం ఇబ్బందిగా ఉండేది. రెండో ఎంఈఓ పూర్తిగా అకడమిక్ బాధ్యతలు చూసుకుంటారు. జిల్లాలో అన్ని మండలాల్లోనూ పోస్టులు భర్తీ చేశాం. పూర్తిస్థాయి జాబ్‌చార్ట్ రాగానే పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. – ఎం. సాయిరామ్ ఎంఈఓ

ఇలాహి మెరిసె..మురళీధర్ మురిసె

- ఏపీఆర్ఎస్ విద్యార్థి ఇలాహికి రాష్ట్ర స్థాయి అవార్డు
- సీఎం జగన్ చేతుల మీదుగా సన్మానం, నగదు ప్రోత్సాహకం



సీఎం వైఎస్ జగన్‌తో అవార్డు అందుకుంటున్న ఇలాహి, ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: పదో తరగతిలో సత్తాచాటి రాష్ట్రస్థాయి 3వ ర్యాంకు సాధించిన కొడిగెనహళ్లి ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థి ఇలాహి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డు అందుకున్నారు. అదే వేదికపై పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు కూడా ప్రశంసాపత్రం అందుకుని మురిసిపోయారు. మంగళవారం రాష్ట్ర స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం విజయవాడలోని కన్వెన్షన్ హాలులో అట్టహాసంగా సాగింది. పదో తరగతిలో 600 మార్కులకు గానూ 590 మార్కులు తెచ్చుకుని రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకును సాధించిన ఏపీ ఆర్ఎస్ కొడిగెనహళ్లి విద్యార్థి ఇలాహిని సీఎం జగన్ సత్కరించారు. రూ.50 వేల ప్రోత్సాహక నగదుతో పాటూ ప్రశంసా పత్రం, మెడల్‌ను అందజేశారు. ఇదే వేదికపై పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు కూడా సీఎం నుంచి సన్మానం అందుకున్నారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన ఇలాహిని ఇప్పటికే జిల్లా అధికారులు సన్మానించారు.

క్లుప్తంగా

రాజీ మార్గమే రాజ మార్గం



మాట్లాడుతున్న లోక్‌అదాలత్ ధర్మాసనం అధ్యక్షుడు శ్రీనివాసరావు

అనంతపురం: రాజీ మార్గమే రాజ మార్గమని, ఇరు పక్షాల నడుమ రాజీ కుదిరితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. అనంతపురం కోర్టు ప్రాంగణంలోని లోక్ అదాలత్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవాధికార చట్టం కింద లోక్ అదాలత్‌తో పాటు శాశ్వత లోక్‌అదాలత్ కూడా ఏర్పాటవుతుందన్నారు. ప్రజా ప్రయోజనాల సేవల కేసుల్లో తప్పనిసరిగా పరిష్కారం పొందే విధంగా శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందన్నారు. న్యాయ సేవాధికార చట్టంలోని సెక్షన్–22 బీ కింద శాశ్వత లోక్ అదాలతలు దేశ వ్యాప్తంగా ఏర్పడ్డాయని తెలిపారు. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి అధ్యక్షులుగాను, అనుభవజ్ఞులైన విశ్రాంత అధికారులు మరో ఇద్దరు సభ్యులుగాను ఉన్న ఈ శాశ్వత లోక్ అదాలత్ బెంచ్ ఫిర్యాదులను స్వీకరిస్తుందని చెప్పారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా అనంతపురంలోని న్యాయ సేవా సదన్‌లో ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్ ఉందన్నారు. ఇందులో ఫిర్యాదు చేయడానికి ఎటువంటి కోర్టు ఫీజు, రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. శాశ్వత లోక్ అదాలత్‌కు గరిష్ట అధికార పరిమితి కోటి రూపాయలుగా నిర్ణయించామన్నారు. ఫిర్యాదు దాఖలుకు మూడు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందన్నారు. ఆ లోగా దాఖలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు ఎం. రాజశేఖర్ రెడ్డి, ఎంపీఎల్ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లోని నిరుపయోగమైన వస్తువుల వేలం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను వేలం వేయనున్నారు. ఈ మేరకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిరుపయోగంగా ఉన్న ఐరన్ ర్యాక్‌లు, ట్రంకు పెట్టెలు, జింక్ బకెట్లు, అల్యూమినియం పాత్రలు, ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్ సామానులు, చెక్క బల్లలు, కుర్చీలు, ఇతరత్రాలను వేలం వేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 21 నుంచి టెండరు ఫారాలు తీసుకెళ్లి 30వ తేదీ సాయంత్రం 5 గంటలల్లోపు పుట్టపర్తి సమీపంలోని కమ్మవారిపల్లి రోడ్డులో ఉన్న దీనజనోద్ధరణ భవన సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమం, సాధికారత అధికారి భవనం నెంబర్ 5లో అందేలా పంపాలి. గడువు తర్వాత అందిన టెండరు ఫారాలు స్వీకరించబడవు. దరఖాస్తు రుసుము రూ.వెయ్యి, ఈఎండీ రూ.25 వేలుగా నిర్ధారించారు.

డిగ్రీ విద్యలో సమూల మార్పులు

- ఇప్పటి వరకూ మూడు కామన్ సబ్జెక్టులతో యూజీ విద్య
- ఇకపై మేజర్, మైనర్ సబ్జెక్ట్ కాంబినేషన్‌తో గ్రాడ్యుయేషన్
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
- గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే పరిపూర్ణత సాధించేలా
- డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ



ఎస్కేయూ ముఖద్వారం

అనంతపురం: విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) విద్యలో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా నూతన విద్యా ప్రణాళిక(కరిక్యులమ్)ను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకూ డిగ్రీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండేది. ఇకపై మేజర్ సబ్జెక్టు ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్త విధానం అమల్లోకి వచ్చింది. ఈ మేరకు విద్యా ప్రణాళికను మార్పు చేస్తూ ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. ఏదైనా ఒక సబ్జెక్టులో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా విద్యా ప్రణాళికను అమలులోకి తీసుకువచ్చారు.

మూడింట ఒక్కటే మేజర్ సబ్జెక్ట్‌గా

గతంలో బీఎస్సీలో ఎంపీసీ తీసుకున్న విద్యార్థులకు ప్రధానంగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లను తప్పనిసరిగా అభ్యసించాల్సి ఉండేది. ప్రస్తుతం ఆ మూడు పాఠ్యాంశాల్లో నుంచి తమకు నచ్చిన ఓ సబ్జెక్ట్‌ను మేజర్‌గా ఎంపిక చేసుకుంటే చాలు. రెండో సెమిస్టర్‌లో దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన ఓ మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. ఈ రెండు మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్య వరకు అభ్యసించేలా సమూల మార్పులు చేశారు.

బీఎస్సీ, బీఏ, బీకామ్‌లో అమలు

యూజీ విద్యలో మేజర్ సబ్జెక్టుతో పాటు కచ్చితంగా ఓ మైనర్ సబ్జెక్టు చదవాలి. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటా సైన్స్, మార్కెటింగ్.. ఇలా ఇతర ఏ సబ్జెక్ట్‌నైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్ కోర్సుల్లో భాగంగా ఇంటర్మీడియట్ కోర్సుల ఆధారంగా తమకు నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్ డిగ్రీలో అమలు చేయనున్నారు. డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజినీరింగ్‌తో సమానంగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం చేస్తాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ వెలువరించారు. కొత్త విధానంపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నారు.

నాలుగో ఏడాది డిగ్రీకి అనుమతి

దేశంలోనే తొలిసారిగా నూతన జాతీయ విద్యావిధానం–2020 మేరకు విద్యా సంస్కరణలను మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారు. ఇప్పటికే నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మూడో ఏడాది డిగ్రీ విద్య పూర్తయింది. యూజీసీ ఫ్రేమ్ వర్క్ ప్రకారం యూజీ విద్యను రెండు విధాలుగా విభజించారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించిన వారు రీసెర్చ్ ఆనర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పీజీ లేకుండా నేరుగా పీహెచ్‌డీ కోర్సుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ ఆనర్స్ కోర్సును అభ్యసించవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో రెండో ఏడాదిలో చేరవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఆనర్స్ కోర్సులను అందించేందుకు నిబంధనలు విధించారు. మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే ఆనర్స్ కోర్సుల బోధనకు అనుమతి మంజూరు చేస్తారు.

డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచే సింగిల్ సబ్జెక్టు స్పెషల్ డిగ్రీ విధానం అమల్లోకి వచ్చింది. ఒక సబ్జెక్టుపై సమగ్రమైన అవగాహనతో పాటు, ఇతర సబ్జెక్టులపై కూడా పట్టు సాధించేలా నూతన విద్యా ప్రణాళికకు రూపకల్పన చేశారు. నూతన విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఇప్పటికే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లను ఆదేశించాం.

– ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, రిజిస్ట్రార్, ఎస్కేయూ

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాల సమీపంలో పాత మసీదు వద్ద మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తిరుపాల్, కాంతమ్మలు ద్విచక్రవాహనంలో పనినిమిత్తం అనంతపురం వెళ్లి తిరిగి చిగిచెర్ల మీదుగా ధర్మవరానికి వస్తున్నారు. పట్టణంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాల సమీపంలోని పాత మసీదు వద్దకు రాగానే శాంతినగర్ వైపు నుంచి గొల్లపల్లికి వెళ్లే కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపాల్, కాంతమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

కదిరి టౌన్: పట్టణంలోని అడపాల వీధిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి ఇంట్లో 15 తులాలు బంగారు చోరీకి గురైనట్లు పట్టణ పోలీసులు తెలిపారు. శేఖర్‌రెడ్డి, అతని భార్య టీచర్ కావడంతో ఇద్దరూ మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగలకొట్టి లోపలికి చొరబడి బీరువాల్లో ఉన్న 15 తులాల బంగారు దోచుకువెళ్లినట్లు బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి,సీసీ పుటేజ్ పరిశీలించారు.

డీసెట్‌లో అనంత విద్యార్థినికి మొదటి ర్యాంకు



మొగల్ షీమ షాలెహ

రాప్తాడు రూరల్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీసెట్)–2023 ఉర్దూ మీడియం ప్రవేశ పరీక్షలో అనంతపురం నగరానికి చెందిన మొగల్ షీమా షాలెహ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. సోమవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో 100కు 60 మార్కులు సాధించినట్లుగా తేలింది. కాగా, షీమా తల్లిదండ్రులు అనంతపురంలోని ఆజాద్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఫుడ్ క్యాటరర్స్ నిర్వహణతో కుటుంబాన్ని తండ్రి సాదిక్‌బాషా పోషిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ మీడియం పదో తరగతి చదివి 10/10 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్‌ను కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఎంహెచ్‌సీ (ఉర్దూ మీడియం) పూర్తి చేసింది. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన షీమాను శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ ఆకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.అబ్దుల్‌మాలిక్, హెచ్ఎం రవీంద్రబాబు, ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, ఫనులు, రెహమాన్, కలీముల్లా, ఫర్హానా, కమురున్నిసా అభినందించారు. ఈ సందర్భంగా షీమా మాట్లాడుతూ తనకు చదువులు చెప్పిన గురువుల స్ఫూర్తితో ఈ విజయాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

పదోన్నతులపై దృష్టి పెట్టండి

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులపై దృష్టి పెట్టాలంటూ జెడ్పీ సీఈఓ కె.భాస్కర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు విన్నవించారు. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాబాఫక్రుద్దీన్, రమేష్‌బాబు మంగళవారం సీఈఓను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఇటీవల కొందరు పరిపాలనాధికారుల(ఏఓలు)ను ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించి, పోస్టులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా ఎనిమిది ఏఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయనిఅర్హులైన వారితో ఆ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పొరుగు జిల్లాల్లో పోస్టులు ఖాళీ ఏర్పడినప్పుడల్లా అర్హులైన వారితో భర్తీ చేస్తున్నారని, దీంతో వారంతా జోనల్ స్థాయి సీనియారిటీలో ముందు వరుసలో ఉంటున్నారని గుర్తు చేశారు. దీనిపై సీఈఓ భాస్కరరెడ్డి సానుకూలంగా స్పందించారు. వారంలోపు ఏఓలకు పదోన్నతులు కల్పిస్తామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

ఉనికి కోల్పోయిన స్వతంత్ర జర్నలిజం

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ



మాట్లాడుతున్న విశ్రాంత జడ్జి గోపాలగౌడ




ఎంహెచ్ స్మారక అవార్డు అందుకుంటున్న తుమ్మలపల్లి ప్రసాద్

ప్రశాంతి నిలయం: రాజకీయ జోక్యం కారణంగా స్వతంత్ర జర్నలిజం ఉనికి కోల్పోయిందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ ఆందోళన వ్యక్తం చేశారు. మెజారిటీ మీడియా సంస్థలు ఏదో ఒక రాజకీయ పార్టీతోనో, భావజాలంతోనే పొత్తు పెట్టుకోవడమే ఇందుకు కారణమన్నారు. స్థానిక ఆర్‌వీ జానకీరామయ్య కల్యాణమంటపం వేదికగా కామ్రేడ్ మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలగౌడ హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రజాశక్తి పత్రిక ఎడిటర్ తులసీదాస్, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి తదితరులతో కలసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు – మీడియా పాత్ర' అంశంపై ప్రసంగించారు. ద్వేష పూరిత ప్రసంగాలు, మత విద్వేషాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయన్నారు. ఇలాంటి అరాచకాలను పరమత సహనం పాటించే మన దేశంలో అపడం సవాల్‌గా మారిందన్నారు. స్త్రీ సమానత్వ అంశాన్ని ఆర్టికల్ 14లో పొందుపరిచినప్పటికీ అన్ని రంగాల్లో సమానత్వం కల్పించడం రాజ్యాంగానికి అతి పెద్ద సవాలుగా మారిందన్నారు. జనాభాలో 50 శాతమున్న మహిళలకు పార్లమెంట్‌లో 25 శాతం సీట్లు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. దేశ వ్యాప్తంగా డజన్ల కొద్ది అనుభవజ్ఞులైన మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తులున్నా.. సుప్రీంకోర్టులో మాత్రం కేవలం ముగ్గురు మాత్రమే న్యాయమూర్తులుగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా జర్నలిస్టులు పనిచేస్తున్నారన్నారు. సమాజాభివృద్ధిలో వార్తా పత్రికలు కీలకంగా పని చేస్తుండడాన్ని అభినందించారు. ఆదర్శ ప్రాయమైన జీవితాన్ని గడిపిన మోటూరు హనుమంతరావు, బొమ్మారెడ్డి నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి పాత్రికేయుడూ వారి అడుగు జాడల్లో నడవాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను జర్నలిస్టులు కాపాడిన తీరును కొనియాడారు. అనంతరం మోటూరు హనుమంతరావు స్మారక అవార్డును హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు తుమ్మలపల్లి ప్రసాద్‌కు అందజేసి, ఘనంగా సత్కరించారు. అలాగే బొమ్మరెడ్డి స్మారక అవార్డును బ్యూరో, స్టాపర్ కేటగిరిలో రాజమహేంద్రవరానికి చెందిన పాత్రికేయుడు బి.శ్రీనివాసాచారికి, మండల స్థాయి విలేకరుల కేటగిరిలో హిందూపురం, సింగరాయకొండకు చెందిన విలేకరులు షబ్బీర్, రవికుమార్‌కు అందజేశారు.

నీవు లేని జీవితం నాకెందుకు?

- భార్య మరణం జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య




ఆత్మహత్య చేసుకున్న రవికుమార్

పెద్దవడుగూరు : కోనాపురంలో విషాదం చోటు చేసుకుంది. ప్రసవ సమయంలో భార్య, 11 రోజుల తర్వాత పసికందు మరణం అతడిని కలచి వేసింది. భార్య లేని జీవితం శూన్యమనిపించింది. జీవితంపై విరక్తితో పెళ్లి రోజునే ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం మేరకు.. పెద్దవడుగూరు మండలం కోనాపురంలో నిట్టూరు రవికుమార్ (24)కు రెండేళ్ల క్రితం యాడికి మండలం చందన లక్ష్మంపల్లికి చెందిన చంద్రకళతో వివాహమైంది. వీరి దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగింది. గత నెలలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన చంద్రకళ కొద్దిసేపటికే మృతి చెందింది. 11 రోజుల తర్వాత పసికందు కూడా చనిపోయింది. దీంతో రవికుమార్ మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం పెళ్లి రోజు. గత స్మృతులను తలచుకుంటూ కాసేపు మౌనంగా ఉండిపోయాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులెవరైనా రక్షిస్తారేమోనని భావించి ఉరివేసుకుని ప్రాణం తీసుకున్నాడు. నెల రోజుల వ్యవధిలోనే ముగ్గురి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

కుష్టువ్యాధి సర్వే పక్కాగా చేపట్టండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి

ప్రశాంతి నిలయం: కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించేందుకు ఈ నెల 28 నుంచి జూలై 16వ తేదీ వరకూ సర్వే చేపట్టి వివరాలు పక్కాగా నమోదు చేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. కుష్టు వ్యాధి సర్వే ప్రక్రియపై స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణ, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. వ్యాధిని గుర్తించే విధానాన్ని వివరించారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నాగరాజునాయక్, డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్ఓ నరేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, సరస్వతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యువకుడి హత్య

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ
- కారకులైన ముగ్గురిపై కేసు నమోదు



మారుతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రొద్దం: వివాహేతర సంబంధం కారణంగా ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన ఓ వివాహితతో అదే గ్రామానికి చెందిన బి.మారుతి (36) కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో మారుతి ఆమె ఇంటికి చేరుకుని తలుపు తట్టాడు. అప్పటికే లోపల ఉన్న హనుమంతు (మహిళకు కొడుకు వరుసవుతాడు) తలుపులు తీసి ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికాడు. అయినా మారుతి వినకుండా ఘర్షణ పడ్డాడు. దీంతో సహనం కోల్పోయిన హనుమంతు వెంటనే మారుతిపై దాడి చేసి రోడ్డుపై లాగి పడేశాడు. ఘటనతో మారుతి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ హుస్సేన్ పీరా, సీఐ కరుణాకర్, ఎస్ఐ నాగస్వామి మంగళవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. హతుడి బంధువుల ఫిర్యాదు మేరకు హనుమంతు, మల్లేష్, నారాయణస్వామిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

హిందూపురం అర్బన్: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం నాగేపల్లికి చెందిన భాస్కర్(30) మగ్గం పనితో జీవనం సాగించేవాడు. ఇటీవల పని లేకపోవడంతో కుటుంబపోషణ, ఇతర అవసరాలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులతో అప్పులు చేశాడు. కొంత కాలంగా అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన భాస్కర్ హిందూపురంలోని హయగ్రీవ ఆలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తండ్రి వద్దకు చేరుకున్నాడు. మంగళవారం ఉదయం ఆలయం సమీపంలోనే ఉన్న ఇంటి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, భాస్కర్‌కు భార్య ఉంది. సంతానం లేరు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రెండో పట్టణ ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

కూలీ ఆత్మహత్య

ధర్మవరం: ఒంటరి జీవితాన్ని భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన సాకే నాగరాజు (40) కూలి పనులతో జీవనం సాగించేవాడు. భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. రెండేళ్ల క్రితం భార్య నాగేంద్రమ్మతో గొడవపడి వేరుగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల ఒంటరి జీవితాన్ని భరించలేక మనోవేదనకు లోనైన నాగరాజు... మంగళవారం ధర్మవరంలోని తిక్కస్వామి ఆలయం సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ప్రతి సంఘం ఆదర్శం కావాలి


- వైకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య



మాట్లాడుతున్న పీడీ నరసయ్య

ఓడీ చెరువు: ప్రతి గ్రామైఖ్య సంఘం ఆదర్శ గ్రామ సంఘం కావాలని వైకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య అన్నారు. ఓడీ చెరువు డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ నరసయ్య, ఎల్‌డీఎం రమణమూర్తి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వందశాతం అన్ని రకాల అప్పులను రికవరీ చేసి పంపాలన్నారు. గ్రామ సంఘాల ఆదాయం పెంచుకోవాలన్నారు. సంఘాల వారి ప్రాజెక్ట్ అంశాలపై సమీక్షించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను వంద శాతం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పీఎంఈజీపీ స్కీం ద్వారా మైక్రో ఎంటర్‌ప్రైజెస్ కోసం రూ. లక్ష వరకు రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీ రామ్మోహన్,క్లస్టర్ కోఆర్డినేటర్లు, మండల సమైఖ్య లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కుప్పకూలి వ్యక్తి మృతి



మృతుడు గోపి

అనంతపురం క్రైం: స్థానిక శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్నఫళంగా కుప్పకూలి ఓ వ్యక్తి మృతిచెందాడు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... మంగళవారం ఉదయం శ్రీకంఠం సర్కిల్‌లోని ఓ హోటల్ వద్ద టిఫిన్ చేస్తూ వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించారు. కాగా, తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో మృతుడి ఆచూకీ లభ్యమైంది. కర్ణాటకలోని పావగడ కుంబారపువీధికి చెందిన గోపి (42)గా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీసులకు అందుబాటులోకి వచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.